www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 21 ఫిబ్రవరి 2024
5
ఏలూరు

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు : గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సంబంధిత సిబ్బందిని, అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక తంగెళ్లమూడిలోని రాజులపేట వద్ద సచివాలయాన్ని, శనివారపుపేట సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రస్తుతం జిల్లాలో చేపట్టిన నవరత్నాలు పేదలందరికి ఇళ్లు పథకం కింద లబ్ధిదారుల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమం వేగవంతం చేసి, వెంటనే లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 75,447 మంది లబ్ధిదారులకు గాను నేటి మధ్యాహ్నం వరకు 56,454 రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. రిజిస్ట్రేషన్ల పనులను గమనించాలని అధికారులను ఆదేశించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట నగరపాలక కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ ఉన్నారు.

జరిమానాల.. జమానా..!



ఏలూరు పాత బస్టాండ్ వద్ద స్టాప్ లైన్

- ఆటో, క్యాబ్‌లపై రవాణా, పోలీస్ శాఖ తీరు దారుణం
- లోపాల పుట్టగా ఏలూరు పాత బస్టాండ్ సిగ్నల్ పాయింట్
- స్టాప్‌లైన్, జీబ్రాలైన్ ఏర్పాటులో నిబంధనలకు తిలోదకాలు
- సెన్సార్ కెమెరాలతో ప్రతిరోజూ భారీగా జరిమానాలు
- ఆటో, క్యాబ్‌లపై రూ.ఐదు వేల నుంచి రూ. పది వేలు వడ్డన
- ఒక్క ఏలూరులోనే 4, 5 నెలల్లో దాదాపు రూ.ఐదు కోట్ల జరిమానాలు
- ఆటో, క్యాబ్‌డ్రైవర్ల గోడు పట్టించుకోని రవాణా, పోలీస్ శాఖల అధికారులు

ఆటో నడిపితే తప్ప కడుపు నిండని కుటుంబాలు వారివి. వచ్చే కొద్దిపాటి సొమ్ముతోనే ఇల్లంతా ఆధారపడి జీవనం సాగించాల్సిన పరిస్థితి. అలాంటి ఆటో, క్యాబ్ డ్రైవర్ల పట్ల రవాణా, పోలీస్ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఆయా కుటుంబాలను చిదిమేసే పరిస్థితి నెలకొంది. ఏలూరులో ఆటో, క్యాబ్ డ్రైవర్ల నుంచి జరిమానాల పేరుతో జరుగుతున్న దోపిడి చూస్తే ఔరా అనక తప్పదు. పాత బస్టాండ్ సిగ్నల్ పాయింట్ వద్ద నిబంధనలకు తిలోదకాలిచ్చి ప్రతినెలా సెన్సార్ కెమెరాలతో రూ.వేలల్లో జరిమానాలు విధిస్తూ ఆటో, క్యాబ్ డ్రైవర్ల పట్ల అత్యంత ఘోరంగా వ్యవహరించడంతో మాకు న్యాయం చేయండి మహాప్రభో అంటూ రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. పోలీస్, రవాణాశాఖ అధికారులు బాధ్యత తమది కాదంటే తమది కాదంటూ ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు నగరంలో ఆరు వేల ఆటోలు, నాలుగు వేల క్యాబ్‌లు మొత్తం పది వేల వాహనాలు ఉన్నాయి. ప్రతిరోజూ నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఈ వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. రోజంతా కష్టపడినా ఆటోవాలాలకు వచ్చే సొమ్ము ఖర్చులు పోను రూ.500 నుంచి రూ.600 మాత్రమే. ఈ సొమ్ముతో కుటుంబమంతా జీవించాలి. పిల్లల చదువులు, ఆసుపత్రి ఖర్చులు అన్నింటికీ ఈ సొమ్మే ఆధారం. ఆటోవాలాలకు వచ్చే ఈ కొద్దిపాటి సొమ్మును కూడా వారికి దక్కకుండా చేస్తున్న పరిస్థితి ఉంది. రవాణా, పోలీస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏలూరులోని ఆటో, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాల పరిస్థితి దారుణంగా మారింది. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని సిగ్నల్ పాయింట్ వద్ద ఆటో, క్యాబ్ డ్రైవర్లపై కొనసాగుతున్న జరిమానాల జమానా చూస్తే ఎవరైనా నోరెళ్లబెట్టాల్సిందే. నిబంధనల ప్రకారం స్టాప్‌లైన్, జీబ్రాలైన్‌కు మధ్య అడుగుదూరం మాత్రమే ఉండాలని ఆటో, క్యాబ్ డ్రైవర్లు చెబుతున్నారు. ఈ సిగ్నల్ పాయింట్ వద్ద 15 అడుగుల దూరం పెట్టారు. దీంతో స్టాప్‌లైన్ దాటిన ప్రతి ఆటో, క్యాబ్‌పై సెన్సార్ కెమెరాలతో జరిమానాలు విధిస్తున్నారు. ఆటోకు రూ300, క్యాబ్‌కు రూ.వెయ్యి చొప్పున జరిమానా పడుతోంది. ఒక రోజులో రెండు, మూడుసార్లు ఈ జరిమానాలు పడిపోతున్నాయి. గడిచిన మూడు నెలల్లో ఒక్క ఆటోపై రూ.ఆరు వేల వరకూ జరిమానా పడిందంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. నిబంధన ప్రకారం రోడ్డు ఎత్తుపల్లంగా ఉన్నచోట సిగ్నల్ పాయింట్ పెట్టకూడదు. ఇక్కడ ఎత్తుపల్లంగా ఉన్నచోట సిగ్నల్ పాయింట్ ఏర్పాటు చేయడంతో జీబ్రాలైన్, స్టాప్‌లైన్ మధ్య భారీగా దూరం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఇది ఆటో, క్యాబ్ వాలాలకు పెనుశాపంగా మారింది. పక్కకు వెళ్లేందుకు ఫ్రీ లైన్ సైతం ఏర్పాటు చేయని పరిస్థితి ఉంది. గతంలో ఈ చలానాలకు సంబంధించిన సొమ్మును పోలీస్ శాఖ ఖాతాలకు చేరేది. దీనిపై ఇటీవల అవకతవకలు బయటపడటంతో రవాణాశాఖ ఖాతాకు అనుసంధానం చేశారు. దీంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు రోడ్డు ట్యాక్స్ కట్టేందుకు, బ్రేక్ చేయించుకునేందుకు రవాణా శాఖ కార్యాలయానికి వెళ్తే పెండింగ్ జరిమానాలు కడితేనే సంబంధిత సైట్ తెరుచుకుంటుంది. దీంతో ఒక్కసారిగా రూ.వేలల్లో జరిమానాలు చెల్లించలేక ఆటో, క్యాబ్ డ్రైవర్లు అప్పుల పాలవుతున్నారు. ఒక్కో ఆటో, క్యాబ్‌పై సరాసరిన రూ.ఐదు వేల చొప్పున లెక్కించినా గడిచిన నాలుగైదు నెలల్లో ఒక్క ఏలూరులోనే ఆటో, క్యాబ్‌లపై దాదాపు రూ.ఐదు కోట్లకుపైగా జరిమానా విధించిన పరిస్థితి ఉంది. రవాణాశాఖ, పోలీస్ అధికారులు సమిష్టిగా ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఇప్పటికే ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించిన ఆటో, క్యాబ్‌వాలాలు తమ సమస్య పరిష్కారం కోసం ఈ నెల 22, 23 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు సిద్ధమవుతున్నారు. స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోని పరిస్థితి. రెక్కాడితేగాని డొక్కాడని ఆటో, క్యాబ్ డ్రైవర్లపై అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారో ఏ.ఒక్కరికీ అర్థం కావడం లేదు. పెండింగ్ ఈ చలానాలను రద్దు చేయాలని, స్టాప్‌లైన్, సీసీ కెమెరాలను క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకూ తాత్కాలికంగా సిగ్నల్ నిలుపుదల చేయాలని ఆటో, క్యాబ్ డ్రైవర్లు కోరుతున్నారు. ఈ సమస్యపై ఏలూరు ఆర్‌టిఒ కె.శ్రీహరిని వివరణ కోరగా ఇది రవాణాశాఖకు సంబంధించింది కాదని, పోలీస్‌శాఖ పరిధిలోకి వస్తుందన్నారు. జిల్లా పోలీస్‌శాఖ అధికారులు, రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సి ఉందని, స్థానికంగా పరిష్కారం అయ్యే సమస్య కాదని స్పష్టం చేశారు.

3 నెలల్లో రూ.6 వేలు ఫైన్..

కోలా హరిబాబు, ఆటోడ్రైవర్, ఏలూరు నగరం

ఏలూరు నుంచి జంక్షన్ వరకూ ప్రతిరోజూ ఆటో నడుపుతాను. గడిచిన మూడు నెలల్లో రూ.ఆరు వేలు ఫైన్ పడింది. రోజంతా కష్టపడితే రూ.600 కూడా రావడం గగనమే. వచ్చిన సొమ్మంతా జరిమానాలకు సరిపోతున్న పరిస్థితి నెలకొంది. ఇలాగైతే కుటుంబాన్ని ఎలా పోషించాలి. అధికారులు తమ సమస్యను వెంటనే పరిష్కరించాలి. వెంటనే పెండింగ్ జరిమానాలను రద్దు చేసి ఆదుకోవాలి. లేకపోతే బ్రేక్ చేయించాలన్నా, రోడ్డు ట్యాక్స్ కట్టాలన్నా భయమేసే పరిస్థితి ఉంది.

నాలుగు నెలల్లో రూ.6,400 ఫైన్..

మేకా రవితేజ, ఆటో డ్రైవర్, ఏలూరు నగరం

గడిచిన నాలుగు నెలల్లో సెన్సార్ కెమెరాలతో రూ.6,400 జరిమానా పడింది. లైన్ దాటామంటూ ప్రతిసారీ రూ.300 జరిమానా పడుతోంది. ఒక్కో రోజు రెండు, మూడుసార్లు కూడా పడిపోతుంది. ఇలాగైతే ఎలా బతకాలి. అధికారులు మా బాధను అర్థం చేసుకోవాలి. వెంటనే జరిమానాలను రద్దు చేసి న్యాయం చేయాలి. సిగ్నల్ పాయింట్ వద్ద సమస్యను పరిష్కరించాలి.

సిగ్నల్ పాయింట్ సమస్య పరిష్కరించాలి

జె.గోపి, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి

ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని సిగ్నల్ పాయింట్ వద్ద జీబ్రాలైన్, స్టాప్‌లైన్ మధ్య 15 మీటర్ల దూరం పెట్టారు. ఫ్రీలైన్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో సెన్సార్ కెమెరాలతో భారీగా ఆటో, క్యాబ్‌లకు రూ.వేలల్లో జరిమానా విధిస్తున్నారు. ఇది దారుణం. వెంటనే జరిమానాలను రద్దు చేయాలి. తాత్కాలికంగా సిగ్నల్ నిలుపుదల చేయడంతోపాటు సమస్యను వెంటనే పరిష్కరించాలి. లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం.

ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

బకాయిలు చెల్లించకపోతే మెరుపు సమ్మె

జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్

ఏలూరులో ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించకపోతే మెరుపు సమ్మెకూ వెనుకాడబోమని, అవసరమైతే ఎన్నికల విధులు కూడా బహిష్కరిస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆర్థిక బకాయిల సాధన కోసం జెఎసి దశలవారీ ఆందోళనలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఉద్యోగులు ఫైర్‌స్టేషన్ సెంటర్, డిఇఒ కార్యాలయం, జిల్లా గ్రంథాలయం మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జెఎసి రాష్ట్ర కార్యదర్శి డి.వేణుమాధవ్ మాట్లాడుతూ ఆర్థిక బకాయిల సాధన కోసం, ఇతర డిమాండ్ల కోసం ఇప్పటికే ప్రభుత్వంతో అనేకసార్లు చర్చించామని, ప్రతిసారీ ప్రభుత్వం ఉద్యోగులకు మొండిచెయ్యి చూపించిందని, గత్యంతరం లేనిపరిస్థితుల్లో ఉద్యోగులు రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని అన్నారు. ఈ నెల 27న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉద్యోగులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతినెలా జీతంలో 20 శాతం జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ రూపంలో ఉద్యోగులు ప్రభుత్వం దగ్గర దాచుకుంటున్నారని, ఉద్యోగులు దాచుకున్న సొమ్ము కూడా ఉద్యోగులకు ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి చేతులు రావడం లేదని అన్నారు. 12వ పిఆర్‌సికి సంబంధించి మధ్యంతర భృతి ఇవ్వాలని అడుగుతుంటే నేరుగా పిఆర్‌సి ఇస్తామని ప్రభుత్వం చెబుతుందని, నేరుగా పిఆర్‌సి ఇచ్చిన దాఖలాలు ఇప్పటి వరకూ లేవని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సాయి శ్రీనివాస్, రుద్రాక్షి రవికుమార్, శ్రీధర్‌రాజు, కప్పల సత్యనారాయణ, సునీత, మల్లిక, సత్యభారతి పాల్గొన్నారు.

కళ్యాణమస్తు, షాదీ తోఫా నిధుల జమ

జిల్లాలో 437 మంది లబ్ధిదారులకు రూ.3.52 కోట్లు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఏలూరు



నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

జిల్లాలో వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా కింద 477 మంది లబ్ధిదారులకు రూ.3.52 కోట్ల నిధులను లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఐదో విడత వైఎస్ఆర్ కళ్యాణమసు, షాదీతోఫా కింద అక్టోబర్, డిసెంబర్-2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జమ చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీప్రసాదరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, సోషల్ వెల్ఫేర్ జెడి జయప్రకాష్, ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, మైనార్టీల అధికారి ఎన్ఎస్.కృపావరం, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఆర్.నాగరాణి, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 437 జంటలకు రూ.3.52 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. వీరిలో బిసిలు 198 మందికి రూ.కోటీ 13 లక్షల 50 వేలు, ఎస్‌సిలు 207 మందికి రూ.2 కోట్ల 9 లక్షల 80 వేలు, ఎస్‌టిలు ఏడుగురికి రూ.80 లక్షలు, మైనారిటీలు 20 మందికి రూ.2.20 లక్షలు, విభిన్న ప్రతిభావంతులు ఐదుగురికి రూ.75 వేలు ఆర్థిక సహాయం అందిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా ద్వారా నిరుపేదలైన ఆడపిల్లల వివాహానికి, వారి తల్లిదండ్రులకు అందిస్తున్న ఈ ఆర్థిక సహాయాన్ని వినియోగించుకుని నూతన వధూవరులు వారి జీవితాల్లో పరస్పరం మంచి భావాలతో సమాజంలో పేరు తెచ్చుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సాయం పేద తల్లిదండ్రులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో గంటా ప్రసాద్, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ చట్టంపై అవగాహన

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమాజంలోని సామాజిక, ఆర్థిక అసమానతలను తొలగించేందుకు, సామాజిక న్యాయం అందించేందుకు సామాజిక న్యాయం చట్టం ఉపయోగపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఎన్ఆర్.పేటలోని ఎస్‌విఆర్‌కె డిగ్రీ కళాశాలలో మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రామాణికంగా ప్రజలకు కల్పించిన ఈ చట్టంపై అవగాహన కల్పించడం కోసం ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. అసమానతలు తొలగించడం కోసం అట్టడిగిన వర్గాలవారికి రిజర్వేషన్ సౌకర్యం కల్పించడం, ఆర్థిక వెసులుబాటు వంటి చర్యలను ప్రభుత్వాలు తీసుకుంటున్నాయని, అలాగే ఆర్థికంగా వెనుకబడిన అట్టడుగు వర్గాల వారికి అవసరమైన న్యాయ సహాయం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తున్నామని తెలియజేశారు. పానల్ అడ్వకేట్ కోన కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల అవగాహనతో ఉండాలని, సమాజంలో నేడు వాహన ప్రమాదాలు విపరీతంగా పెరిగాయని, కావున ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. ప్రతి యువతీ, యువకులు లైసెన్సును పొంది వాహనాలు నడపాలని, ప్రతి పౌరుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, అలాగే విద్యార్థులు సోషల్ మీడియా ఉపయోగించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మురళీకృష్ణ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వి.శంకర్‌నాయక్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న శంకర్‌నాయక్

గిరిజన విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ సభ్యులు వి.శంకర్‌నాయక్ గిరిజన బాలుర వసతిగృహం అధికారులను హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం జీలుగుమిల్లిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై చికిత్స పొందిన విద్యార్థులను ఆయన పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతిగృహంలో తనిఖీలు చేపట్టిన శంకర్‌నాయక్ లోపలి పరిస్థితులు చూసి నిర్ఘాంతపోయారు. విద్యార్థుల పెట్టెలు ఉండే గదిలో చెత్త పేరుకుపోయి పరిస్థితి దారుణంగా ఉండటంపై సిబ్బందిని నిలదీశారు. విద్యార్థులు పడుకునే చోట ఉన్న ఫ్యాన్‌లు తుప్పుపట్టి తిరగకపోవడాన్ని గుర్తించారు. బాత్‌రూమ్‌లో ట్యాప్‌లు పని చేయక నీరు వృథాగా పోవడాన్ని గమనించారు. ఉడకని అన్నం, నీళ్ల చారు చూసి విద్యార్థులకు భోజనం పెట్టేది ఇలాగేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. స్టోర్‌రూమ్‌లో కూరగాయలు కుళ్లిన స్థితిలో ఉండటంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతిగృహ వార్డెన్, హెచ్‌ఎం, ఎటిడబ్ల్యుఒ తీరుపై మండిపడ్డారు. గిరిజన పిల్లలంటే ఇంత నిర్లక్ష్యమా అని వారిని ప్రశ్నించారు. ఈ ముగ్గురిపై చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ ఎపిఒ పివిఎస్.నాయుడును ఆదేశించారు. దీనిపై తాను కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు. రెండు రోజుల్లో వసతిగృహాన్ని సుందరవనంగా మార్చాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌డిఒ అద్దయ్య, తహశీల్దార్ వెంకటేశ్వరావు, సిఐ క్రాంతికుమార్ ఉన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్: అస్వస్థతకు గురైన విద్యార్థులు కోలుకునే వరకూ మెరుగైన చికిత్స అందింఆచలని ఎస్‌టి కమిషన్ సభ్యులు వి.శంకర్‌నాయక్ వైద్యాధికారులను ఆదేశించారు. జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంగళవారం ఆయన పరామర్శిం చారు. విద్యార్థుల తల్లితండ్రులను కలిసి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ ఇఇ నాయుడు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ కె.వరలక్ష్మి, ఆసుపత్రి సూపరింటెండెంట్ బేబీకమల, డిటి రమేష్ తదితరులు పాల్గొన్నారు. దీనికి ముందు జెసి లావణ్యవేణి విద్యార్థులను పరామర్శించార

జంగారెడ్డిగూడెంలో జెసి లావణ్యవేణి పరామర్శ

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

ఎపి గిరిజన సంఘం

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై వెంటనే చర్యలు చేపట్టాలని ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ సిఐటియు జిల్లా నేత ఎం.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటిడిఎ డిడి, ఎటిడబ్ల్యుఒ, స్కూలు హెచ్‌ఎం, హాస్టల్ వార్డెన్ దీనికి పూర్తి బాధ్యత వహించాలన్నారు. నాసిరకం కూరగాయలు, సరుకులు పంపిణీపై చేసే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టకపోతే గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఎన్నికల విధుల్లో పొరపాట్లకు తావివ్వకండి..

రిటర్నింగ్ అధికారి ఎస్‌కె.ఖాజావలి

మాట్లాడుతున్న ఖాజావలి

ఉంగుటూరు: ఎన్నికల విధులను ఇష్టపూర్వకంగా నిర్వహిస్తే ఎలాంటి చిన్న పొరపాట్లకు కూడా స్థానం ఉండదని ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో), ఏలూరు ఆర్‌డిఒ ఎస్‌కెఎన్.ఖాజావలి అన్నారు. నియోజకవర్గ స్థాయి ఎన్నికల సిబ్బందికి ఒక రోజు శిక్షణా కార్యక్రమం మంగళవారం నారాయణపురం లయన్స్ క్లబ్ ఆవరణలో నిర్వహించారు. ఎన్నికల సంఘం చెప్పిన నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించి ప్రశాంతంగా ఎన్నిలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారితో పాటు మరో ఐదుగురు సిబ్బంది ఆ ఆరుగురే ఎన్నికల ప్రక్రియలో కీలకమన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, వివిధ టీమ్‌ల సమన్వయంతో ఎలా పనిచే యాలో వివరిస్తూ శిక్షణ ఇచ్చారు. నియోజకవర్గంలో 214 పోలింగ్ కేంద్రాలకు 26 సెక్టోరల్ అధికారులను నియమించామన్నారు. ఒక్కో సెక్టోరల్ అధికారి పరిధిలో 10 పోలింగ్ కేంద్రాల పర్యవేక్షణలో ఉంటాయన్నారు. ఒనరబుల్ మ్యాపింగ్ 1, 2 దశలు పూర్తి చేసి రెండురోజుల్లో రిపోర్టు చేయాలని ఆర్వో ఆదేశించారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు తనిఖీల్లో దొరికితే ఆదాయ పన్ను అధికారులకు సమాచారం ఇవ్వాలని విధి విధానాలను వివరించారు. ఎంఎల్ఎ అభ్యర్థి ఎన్నికల వ్యయం రూ.40 లక్షలు, ఎంపీ అభ్యర్థి ఎన్నికల వ్యయం రూ.90 లక్షలు ఉంటుందని, పోటీచేసే అభ్యర్థుల ఖర్చు వివరాలను నిష్పక్షపాతంగా గుర్తించి సిబ్బందికి రిటర్నింగ్ అధికారి ఖాజావలి పలు సూచనలిచ్చారు. పోలీసు సిబ్బందికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల వివరాలను వెల్లడించాలని పలువురు సిబ్బంది కోరగా మంగళవారం ప్రొసీడింగ్స్ ఇస్తామని ఆర్వో చెప్పారు. ఉంగుటూరు, భీమడోలు తహశీల్దారు శివయ్య, వరహాలరావు, నిడమర్రు సిఐ ఎం.సుభాష్, చేబ్రోలు, గణపవరం, నిడమర్రు ఎస్ఐలు, వివిధస్థాయి అధికారులు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

భద్రతామాసోత్సవాల ముగింపులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి మేరీ ప్రశాంతి

ఏలూరు: రోడ్డు భద్రతా అందరి బాధ్యత అని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి మేరీ ప్రశాంతి అన్నారు. 32వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు సందర్భంగా స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కలెక్టర్, ఎస్‌పి హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ మోటారు సైకిల్‌పై మితిమీరిన వేగంతో నడుపుతూ, విన్యాసాలు చేస్తూ వీడియోలను వైరల్ చేసే ఆకతాయిలపై సుమోటాగా కేసు నమోదు చేయాలని ఎస్‌పికి సూచించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపే యువకులను గుర్తించి వారిపై సుమోటోగా కేసులు నమోదు చేయాలన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులు రహదారులపై ఎదుటివారిని భయభ్రాంతులకు గురిచేస్తూ టూ వీలర్లపై మితిమీరిని వేగంతో ప్రయాణించి, ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. సమావేశంలో పాల్గొన్న ఆటోడ్రైవర్లను ఉద్దేశిస్తూ కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఆటో డ్రైవర్లు ప్రయాణికుల ప్రాణాలు కాపాడే రథసారధులని పేర్కొన్నారు. ఈ రథసారధులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఆటోలు నడిపే సమయంలో మద్యం సేవించకుండా ఆటోలు నడిపి ప్రజలను సురక్షిత గమ్యాలకు చేర్చాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటించాలన్నారు. అతివేగంగా వెళ్లడం వల్ల మీప్రాణాలకే కాకుండా ఎదుటవారి ప్రాణాలు పోయే అవకాశం ఉందని, అందువల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్న వాస్తవాన్ని గ్రహించాలన్నారు. ఏలూరు నగరంలో రూ.2 కోట్లతో రహదారి గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఆర్ అండ్ బి రహదారులు మెయింటెనెన్స్‌కు గ్రాంటు వచ్చిందన్నారు. ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగితే వెంటనే స్పందించాలని, ప్రమాదానికి గురైన వారిని అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అనంతరం ఎస్‌పి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఆటో, లారీ, ట్రక్ డ్రైవర్‌లు మద్యం సేవించి మితిమీరిన వేగంతో వాహనాలు నడిపి, వారి ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలు కూడా తీస్తున్నారని అన్నారు. మద్యపానం వల్ల ప్రమాదాలు సంభవించి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని హెచ్చరించారు. ఉప రవాణా కమీషనర్ ఎస్.శాంతకుమారి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా బై పాస్‌లు, జాతీయ రహదారుల్లోనూ జరుగుతున్నాయన్నారు. ట్రాన్స్ పోర్ట్ అధికారుల సూచనలు పాటించి వాహనాలు నడిపితే మీ ప్రాణాలతో పాటు ఎదుటి వారి ప్రాణాలు కూడా కాపాడిన వారౌతారని భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. 2030 నాటికి కనీసం సగం రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్ఇ జాన్ మోషే, డిఎస్‌పి ప్రభాకర్, జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి వరప్రసాద్, ఆర్‌టిఒ కె.శ్రీహరి, మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్లు కెవిఎస్ ప్రసాద్, జి.ప్రసాదరావు, జి.నాగమురళి, రహదారి భద్రత వైద్యురాలు జి.మౌనిక, పంచాయతీరాజ్ ఎస్ఇ, జిల్లాస్థాయి ఆర్‌టిఒ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు సేఫ్టీ కో ఆర్డినెటర్లుగా శిక్షణ పొందిన వారికి కలెక్టర్, ఎస్‌పి చేతుల మీదగా సర్టిఫికెట్స్ అందజేశారు.

24న నూతన ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని, నూతన ఆసుపత్రి భవనాలను మంగళవారం ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన నూతన ఆసుపత్రి భవనాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూతన ఆసుపత్రి భవనాలను రూ.24 కోట్ల వ్యయంతో, అన్ని వసతులతో, అత్యాధునికంగా నిర్మించినట్లు తెలిపారు. ఆసుపత్రి ప్రారంభోత్సవానికి మంత్రి విడదల రజిని రానున్నట్లు ఎంఎల్‌ఎ తెలియజేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని మర్రిపూడి, సీతారాంపురం, వల్లెర్లమూడి, మధిబంధం, ఎంఎన్ పాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపిడిఒ కిరణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల వద్ద ఉన్న సౌకర్యాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. సౌకర్యాలు లేని వాటిపై క్రింది స్థాయి ఉద్యోగులకు తగిన సూచనలు చేశారు.

నూతన సంక్షేమాధికారులు నియామకం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ఆర్‌జియుకెటి ప్రాంగణంలో విద్యార్థి సంక్షేమ అధికారులను మంగళవారం నియమించారు. భౌతికశాస్త్ర విభాగంలో డీన్ ఎ.సుబ్రహ్మణ్య స్వాములు (బాలురకు), ఆంగ్ల విభాగంలో మెంటర్‌గా పనిచేస్తున్న డీన్ టి.దుర్గా భవాని (బాలికల) సంక్షేమ అధికారులుగా నియమితులయ్యారు. వీరు సంవత్సర కాలం పాటు ఆయా పదవుల్లో కొనసాగనున్నారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ వారిని అభినందించారు.

రాజ్యాధికారమే అంతిమ లక్ష్యం

కాపు జెఎసి పిలుపు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

రాజకీయాలకు అతీతంగా కాపు జెఎసి కాపులకు రక్షణ కవచంగా పనిచేస్తుందని కాపు జెఎసి నాయకులు స్పష్టం చేశారు. రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో జెఎసి ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెంలోని సౌభాగ్య కాంప్లెక్స్‌లో మంగళవారం కాపు జెఎసి సమావేశం మాజీ డిసిసిబి ఛైర్మన్, సినీ నిర్మాత కరాటం రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏజెన్సీ పెద్ద ప్రాంత కాపు సంఘ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు కరాటం పిలుపు మేరకు పాల్గొన్నారు. సమావేశంలో కాపు జెఎసి అధ్యక్షులు చందు జనార్ధన్ మాట్లాడుతూ 25 శాతం ఉన్న కాపు వర్గాలు రాజ్యాధికారం వైపు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర నాయకులు ముత్యాల రామదాసు, నల్లా విష్ణు, వారిరెడ్డి ఏసుదాసు, మంచాల సాయి సుధాకర్ నాయుడు, స్థానిక జెడ్‌పిటిసి మెంబర్ పోల్నాటి బాబ్జి పాల్గొన్నారు.

'అగ్నికుల క్షత్రియులకు క్షమాపణ చెప్పాలి'

ప్రజాశక్తి - కలిదిండి

అగ్నికుల క్షత్రియ జాతి గురించి అవమానకరంగా మాట్లాడిన కాకినాడ సిటీ ఎంఎల్‌ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంగ్రాజు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మట్టగుంటలో ఎంఎల్‌ఎ చంద్రశేఖర్ రెడ్డి గడ్డి బొమ్మతో శవ కార్యులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కాకినాడ సిటీలో 45 వేల ఓట్లున్న బడి ఉన్న అగ్నికుల క్షత్రియ ఓట్ల మద్దతుతో గెలిచి నేడు అదే సామాజిక వర్గాన్ని కించపరచడం దారుణమన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం స్పందించాలన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పకుంటే రాష్ట్రంలో 45 నియోజకవర్గాల్లో బలంగా ఉన్న అగ్నికుల క్షత్రియులు ఏకతాటిపైకి వచ్చి వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అగ్నికుల క్షత్రియ సంఘం నాయకులు కొపనాటి విష్ణు, మోకా వెంకటసుబ్బారావు, పొన్నాల తాతారావు, వాతాడి రాంబాబు, బొమ్మిడి పోతురాజు, అంగ్రాజు నాగూర్, తిరుమలశెట్టి నాగ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ముదినేపల్లి: ముదినేపల్లిలోని ప్రభుత్వ బిసి వసతి గృహం విద్యార్థులకు మంగళవారం స్టడీ మెటీరియల్స్ అందజేశారు. స్థానిక కూరగాయల వ్యాపారి కోన వసంత రావు తన కుమారుడు పవన్ పేరు మీద పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేశారు. అలాగే నూతన దంపతులైన పవన్, ప్రవంతి చేతుల మీదుగా హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులందరికీ స్వీట్స్ పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పి.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఇ-చలానాల రద్దు కోరుతూ రిలే దీక్షలు

ఏలూరు అర్బన్: ఆటోలు, టాక్సీలపై విధిస్తున్న ఇ-చలానాలు రద్దుకై ఈనెల 22, 23 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి తెలిపారు. ఈమేరకు మంగళవారం రిలే నిరాహార దీక్షల కరపత్రాలను స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఫెడరేషన్ నాయకులు మెరుగు రామయ్య, బివివి ఆంజనేయులు, రమేష్, చౌదరి, శివ విడుదల చేశారు.

అవసరాల విద్యార్థులు వ్యాయామం చేయాలి

ముసునూరు: ప్రత్యేక అవసరాల గల విద్యార్థులు ప్రతి రోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేసినట్లయితే ఆరోగ్యకరంగా ఉంటారని ఫిజియోథెరపిస్టు జి.ప్రశాంతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రమణక్కపేట హైస్కూల్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డిఎంఎ.లక్ష్మీనారాయణ, జి.నాగమల్లేశ్వరి, ప్రత్యేక అవసరాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రెండు ఆటోలు ఢీ

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - పోలవరం

రెండు ఆటోలు ఢీకొని ఐదుగురు తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉదయం తాళ్లపూడి వైపు వెళుతున్న పేపర్ డెలివరీ ఆటోలో పోలవరం వంచాయతీ బెస్తపేటకు చెందిన ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు గూటాల తాపీ పనుల నిమిత్తం ఎక్కారు. ఆటో గూటాల కొత్త పట్టిసీమ మార్గమధ్యలో ఉండగా ఎదురుగా వస్తున్న ఉల్లిపాయల ట్రక్ ఆటో వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఉల్లిపాయల ట్రక్ ఆటో వెనుక నుంచి వస్తున్న మరో బైక్ కూడా ఢీకొనడంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు దంపతులు, ఇద్దరు పసిపిల్లలు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో కొయ్యలగూడెం మండలం గవరవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ చావ సుధీర్, పోలవరం పంచాయతీ బెస్తపేటకు చెందిన బొట్ట శ్రీను, ఎన్‌కె.వలీ అనే భవన నిర్మాణ కార్మికులు, బైక్‌పై ప్రయాణిస్తున్న తెలం దుర్గాప్రసాద్, అతని చిన్నారి పాప తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని పోలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం వారిని రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేశారు. ఆటో డ్రైవర్ చావ సుధీర్ ప్రమాదం జరిగిన ప్రాంతం కోసం కొయ్యలగూడెం వెళ్తుండగా జరిగింది... 108 వాహనం కొయ్యలగూడెం వెళ్లడానికి అనుమతించరని తెలియడంతో స్నేహితుల సహాయంతో బైక్‌పై బయలుదేరి వెళ్లారు. స్వల్పంగా గాయపడిన మరో భవన నిర్మాణ కార్మికుడు ఎన్‌కె వలీ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన వారిలో భవన నిర్మాణ కార్మికుడు బొట్ట శ్రీను, తెలం దుర్గాప్రసాద్, అతని చిన్నారి పాపకు కాళ్ల విరిగి మేజర్ ఫ్రాక్చర్ అయినట్లు, మెరుగైన చికిత్స కోసం సిఫార్సు చేయడం జరిగిందని వైద్యులు సిబ్బంది తెలిపారు. ఉల్లిపాయల ట్రక్ ఆటో సిబ్బంది ఆటో డ్రైవర్ సంఘటన ప్రాంతం నుంచి పరారయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కఠిన చర్యలు తప్పవు : ఎస్ఐ

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలో ఎవరైనా అక్రమ మద్యం అమ్మినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవని ముసునూరు ఎస్ఐ పి.వాసు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బలివే గ్రామంలో బలివే గ్రామానికి చెందిన దుర్గారావు చెందిన గోపవరం బెల్ట షాపులో 17 అక్రమ మద్యం బాటిల్స్ తీసుకువచ్చి తమ ఇంటి వద్ద అమ్ముతున్నట్లు సమాచారం అందించారన్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఎన్నికల్లో టిడిపి, జనసేన గెలుపు తథ్యం..!

జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబు

ప్రజాశక్తి - చింతలపూడి

2024 ఎన్నికల్లో జనసేన, టిడిపిల పొత్తులో భాగంగా చింతలపూడి నియోజకవర్గంలో టికెట్ ఏ అభ్యర్థికి ఇచ్చినా గెలుపు తథ్యమని జనసేన మండల అధ్యక్షులు చీదారాల మధుబాబు అన్నారు. పవన్ కళ్యాణ్ మీద అభిమానంతో జనసేనలో చేరి, కొద్దికాలంలోనే జనసేన మండల అధ్యక్షులుగా ఎదిగి, గ్రామ గ్రామాలలో జనసేనని బలోపేతం చేశారు. వయసు చిన్నదైనా, చింతలపూడిలో పవన్ కళ్యాణ్ పర్యటన భాగంగా పూర్తి బాధ్యతలు తన భుజస్కందాలపైన వేసుకుని, జనసేన నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్యతో కలిసి దిగ్విజయంగా చేసి ఔరా అనిపించారు. గ్రామీణ జన సైనికుల నుంచి రాష్ట్ర నాయకుల వరకు తన వైపు చూసే విధంగా చేసుకున్నాడు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే లక్షల్లో జీతం వదులుకొని రాజకీయాల్లోకి వచ్చానని అంటున్న జనసేన మండల అధ్యక్షులు చీదరాల మధుబాబుతో ప్రజాశక్తి చిట్ చాట్

చిట్ చాట్

జనసేనలోకి రావడానికి గల కారణం ఏమిటి?

చిన్నతనం నుంచి మా కుటుంబానికి పవన్ కళ్యాణ్ మీద ప్రత్యేక అభిమానం ఉంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్, భగత్ సింగ్ స్ఫూర్తి, పోరాట పటిమతోనే పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ స్థాపించారు. సినిమాలు తీస్తే కోట్లు వస్తాయి.. విలాసంతమైన జీవితం వదులుకొని ప్రజాసేవకు ముందుకు రావడం, మాలాంటి యువతని ఆలోచింపజేసింది. అప్పుడే నిర్ణయం తీసుకున్నా జనసేనతో ముందుకు నడవాలని.. జనసేన లక్ష్యం బడుగు, బలహీన వర్గాల ఎదుగుదల. నా వంతుగా ప్రజలకు మంచి చేయాలనే లక్ష్యంతోనే రాజకీయాలలోకి వచ్చాను.

ఎన్నికల నాటికి జనసేనని ఏ విధంగా బలోపేతం చేస్తున్నారు?

ప్రతి గ్రామ, పంచాయతీ, మండల స్థాయిలో కమిటీలను పూర్తి చేశాం. అన్ని సామజిక వర్గాలను జనసేన కమిటీలో స్థానం కల్పించాం. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు ప్రాధాన్యత కల్పించాం. పవన్ కళ్యాణ్ పార్టీని స్థాపించి ప్రజలకు ఏవిధంగా సేవ చేయాలనుకుంటున్నారో, దానిపైన విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నాం. ప్రతి జన సైనికుడు, ప్రతి వీర మహిళ తమ గ్రామాలలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నారు.

ఎన్నికల్లో టిడిపి, జనసేన పొత్తు ప్రభావం ఏ విధంగా ఉంటుంది?

ఎన్నికల్లో జనసేన, టిడిపి పొత్తు బలంగా కనిపిస్తుంది. రెండు పార్టీల కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా ముందుకు వెళ్తున్నాం. చిన్న, చిన్న మనస్పర్థలు వచ్చినా వాటిని అధిగమించి 2024లో జనసేన, టిడిపి పొత్తు అభ్యర్థిని గెలిపించుకోవడానికి కృషి చేస్తాం. 2024 ఎన్నికల్లో వైసిపిని ఓడించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉన్నారు. గ్రామీణ స్థాయిలో రెండు పార్టీలు బలంగా ఉన్నాయి.

చింతలపూడి నియోజకవర్గ ఉమ్మడి పొత్తు అభ్యర్థిగా టిడిపికి ఇస్తారా? జనసేనకి ఇస్తారా?

ఏ పార్టీ అభ్యర్థికి ఇచ్చినా కష్టపడి పనిచేసి గెలిపించుకుంటాం. చింతలపూడి నియోజకవర్గంలో కాపు సామాజిక ఓటింగ్ సుమారు 60 వేల వరకు ఉంది. జనసేన అభ్యర్థికి టికెట్ ఇస్తే కాపు సామాజిక వర్గం మొత్తం జనసేనకి సపోర్ట్ చేస్తుంది. ఎస్‌సి, కాపు సామజిక వర్గాల ఓట్లే ఎక్కువగా ఉన్నాయి. టిడిపి అభ్యర్థికి ఇచ్చినా అదే రకంగా కష్టపడి గెలిపించుకుంటాం. ఏదైనా ఇక్కడ లక్ష్యం వైసిపిని ఓడించడమే.

మండలంలోని సమస్యలను ప్రజల వద్దకు ఏ విధంగా తీసుకువెళ్తారు?

చింతలపూడి మండలంలో ప్రధాన సమస్యలు రోడ్లు, డ్రెయినేజీలు. చింతలపూడి నగర పంచాయతీలో సెంట్రింగ్ లైటింగ్, చింతలపూడి ఎత్తిపోతల రైతులకు నష్టపరిహారం, 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చిన నామవరం-సీతానగరం రోడ్డుపై ప్రత్యేక ప్రణాళికలతో ప్రజల వద్దకు సమస్యలను తీసుకువెళ్తాం. నామవరం-సీతానగరం రోడ్డుపై పాదయాత్ర కూడా నిర్వహించాం. చింతలపూడి రోడ్లపై పోరాటాలు చేశాం. ఇప్పుడు టిడిపితో కలిసి సమస్యలపై పోరాడుతాం. ప్రజల వద్దకు తీసుకువెళ్తాం. 2019 నుంచి ఇప్పటివరకు చింతలపూడి నియోజకవర్గంలో రోడ్లు వేయలేదు. చింతలపూడి ఎత్తిపోతల రైతులకు నష్టపరిహారం కల్పించే విధంగా కృషి చేస్తాం.

ఎన్నికల్లో టిడిపి గెలిస్తే.. ప్రాధాన్యత ఇస్తారా? ఇవ్వకపోతే పరిస్థితి ఏంటి?

గతంలో జరిగిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పొత్తు సుదీర్ఘంగా ఉండే విధంగా రెండు పార్టీల అధిష్టానాల నాయకులు, కార్యకర్తల గురించి ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకుని ఉండి ఉంటారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయంతో ముందుకు నడిపిస్తున్నారు. ప్రాధాన్యత ఇచ్చినా ఇవ్వకపోయినా మా అదిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటాం.

వైసిపిని సంక్షేమ పథకాలు గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు, దీని ప్రభావం ఉంటుందా?

ప్రజల వద్ద పన్నుల రూపంలో నగదు వసూలు చేసి, సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు ఇస్తున్నారు. ప్రజలకు అభివృద్ధి చేయకుండా, కనీస రోడ్లు కూడా వేయకుండా, ఓట్లు వేయరు. ప్రజలు వైసిపిని నమ్మే ఆలోచనలో లేరు.

ఆపద సమయంలో భద్రతా పథకాలు దోహదం

మండవల్లి : ఆపద సంభవించిన కుటుంబాలలో భద్రతా పథకాలు ఎంతగానో దోహదపడతాయని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు స్పష్టం చేశారు. స్థానిక ఇండియన్ బ్యాంకులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మండవల్లికి చెందిన యార్లగడ్డ ఎస్తేరు రాణి(41) పిఎం జెజెబివై పథకంలో చేరి ఇటీవల గుండెపోటుతో మరణించడంతో భద్రతా పథకం ద్వారా వచ్చిన రూ.2 లక్షలు నామినికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సామాజిక భద్రతా పథకాలైన ప్రధానమంత్రి జీవనజ్యోతి, బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలపై ప్రతి ఒక్కరు చైతన్యం కలిగి ఉండాలన్నారు. అనంతరం నామినేకి రూ.2 లక్షల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, టి.అప్పారావు, ఝాన్సీ లక్ష్మి, తొండమల్లి లక్ష్మి, వేముల సుశీల పాల్గొన్నారు

కొత్త ఓటర్లను చేర్పించాలి

చింతలపూడి : 2024 సంవత్సరంలో జరగబోయే ఎన్నికలకు సంబంధించి కొత్త ఓటర్లను చేర్పించాలని తహశీల్దార్ గోపాలకృష్ణ అన్నారు. మండలానికి సంబంధించి బూత్ లెవల్ అధికారుల సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దారు గోపాలకృష్ణ, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ శేఖర్, మండల పరిషత్ డెవలప్మెంట్ అధికారి చిన్న రాటాలు ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హోమ్ ఓటింగ్ వేసేందుకు 80 సంవత్సరాల నిండిన వృద్ధులను, పిడబ్ల్యుడి ఓటర్లను గుర్తించాలని ఆదేశించారు.

29లోగా పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

జిల్లా ఖజానా అధికారి టి.కృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించడానికి ఈనెల 29 ఆఖరి తేది అని జిల్లా ఖజానా, లెక్కల శాఖ అధికారి టి.కృష్ణ తెలిపారు. ప్రతి ఒక్క పెన్షనర్ తమ దగ్గరలోని ఉప ఖజానా కార్యాలయం, ఆన్‌లైన్, స్థానిక పోస్ట్ ఆఫీసులలో ఏదైనా దగ్గరలో ఉన్న నెట్ సెంటర్‌లో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించవచ్చన్నారు. లైఫ్ సర్టిఫికెటు సబ్మిట్ చేయని పెన్షనర్లకు సంబంధించి మార్చి 2024 పెన్షన్ ఆపివేయబడునని ఆయన పేర్కొన్నారు. లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించటానికి ఉప ఖజానా కార్యాలయాలకు వచ్చే పెన్షనర్లకు ఇబ్బంది కలగకుండా స్థానిక ఖజానా కార్యాలయాలలో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు. ఏలూరు కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీలో కూడా లైఫ్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయవచ్చన్నారు. ఫ్యామిలీ పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లుతో పాటు నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లు, నాన్ రీ మ్యారేజ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆయన కోరారు. పెన్షనర్స్ ఈ సదుపాయాలను వినియోగించుకొని సకాలంలో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఆయన తెలిపారు.

అభివృద్ధిని ఓర్వలేకపోతున్న ప్రతిపక్షాలు

ఏలూరు ఎంపీ శ్రీధర్

చింతలపూడి : రాష్ట్రంలో ఇటు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి ముందుకు వెళ్తున్నారని, అభివృద్ధిని, సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్షాలు ఓర్వ లేకపోతున్నాయని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, ఎంఎల్‌ఎ అభ్యర్థి కంభం విజయరాజు కలిసి ప్రారంభించారు. రాఘవపురం గ్రామంలో వైసిపి నాయకులు గిరి భోగరావు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై నాట్ 175 కాదన్నా.. నో డౌట్ 175 అని ప్రజలు అంటున్నారని అన్నారు. రాఘవపురంలో కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే, మళ్లీ విజయం మనదే అని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తన మాటను నమ్మి ఎంపీ, ఎంఎల్‌ఎ అభ్యర్థులను తాను సూచించిన అభ్యర్థులకు కేటాయించారని, వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తానని తెలిపారు. ప్రజా సమస్యలపై, నియోజవర్గ అభివృద్ధి పనులపై ఢిల్లీలో పోరాటం చేసి కావలసిన నిధులు తీసుకువస్తానని అన్నారు. అనంతరం కంభం విజయరాజు మాట్లాడుతూ వైసిపి సంక్షేమ పథకాలే మరొకసారి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తాయని అన్నారు. కార్యకర్తలు, నాయకులను అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని, అందరి దీవెనలు కావాలని కోరారు. ఈ జనసమూహం చూస్తుంటే రాప్తాడు సిద్ధం సభ గుర్తుకు వస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి మోలుగుమాటి నీరజ సుధాకర్, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, చింతంపల్లి సర్పంచి తాండ్ర రామకృష్ణ, సీతానగరం గాయం మల్లేశ్వరి, ఎంపిటిసి రాంబాబు, వైసిపి నాయకులు, మిర్యాల దిలీప్ పాల్గొన్నారు.

మీడియాపై దాడులు ఖండించాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫోటో గ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుట్టాయగూడెం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారిదిగా పనిచేస్తూ నిరంతరం విధి నిర్వహణలో ఉండే పాత్రికేయులపై దాడులు చేయడం మంచిది కాదని వారన్నారు. శ్రీకృష్ణపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ రమేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోడూరి ఆనంద్, ఎంఎస్ఆర్ ప్రసాద్, ఎన్.క్రాంతినాథ్, ఎస్.కృష్ణమోహన్, జి.మధుబాబు, పి.మురళీ, ఎస్.రామకృష్ణ, కె.భాస్కర్, ఎం.రమేష్ బాబు, ఎన్.రవి, షేక్ బాజీ పాల్గొన్నారు.

చాట్రాయి: సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి విలేకరుపై దాడి చేసి, గాయపరిచిన వైసిపికి చెందిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండలంలోని ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు మండల ఎంపిడిఒ మంగాకుమారికి మంగళవారం విలేకరులు వినతి పత్రం ఇవ్వడం అందజేశారు. ఈ కార్యక్రమంలో విలేకరులు నెల్లూరి కృష్ణారావు, కొమ్ము అర్జున్ రావు, శ్రీనివాసరావు, రాజేష్, ప్రభాకర్ రావు, ఇవి.శ్రీనివాసరావు, లాజర్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: నిరసన తెలుపుతున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

వాలంటీర్లకు రుణపడి ఉంటాం

ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారిధిలా పనిచేసే వాలంటీర్లకు ఎల్లప్పుడు అందరం రుణపడి పుంటామని నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలోని ముసునూరు మండలపరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి కొండా దుర్గాభవాని వెంకట్రావ్, ఎంపిడిఒ చాగంటి పద్మావతిదేవిల ఆధ్వర్యంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరట ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, వాలంటీర్ల వ్యవస్థ తీసుకువచ్చి అందరికి అన్ని పథకాలు అందేలా చేయడం చాలా ఆనందదాయకమని, మరలా ప్రతి సంవత్సరం మీలో ప్రతిభ కనబర్చిన వారికి సేవా వజ్ర, సేవా రత్నా, సేవా మిత్రా లాంటి ప్రోత్సాహక పత్రాలు అందజేయడంతో మీరు చేసిన సేవకు మంచి గుర్తింపు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి పాముల గంగధరరావు, కోర్లగుంట సొసైటీ అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

ముసునూరు: వాలంటీర్లతో ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

భీమడోలు : గ్రామ వాలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మానస పుత్రికగా ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు అభివర్ణించారు. మండలస్థాయిలో వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని భీమడోలులో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉంగుటూరు ఎంఎల్‌ఎ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నగదు పురస్కారానికి ఎంపికైన 336 సేవా మిత్రలకు, ఐదుగురు సేవారత్న, ఒక సేవా వజ్రలకు మంజూరైన రూ.52.30 లక్షలను ఎంఎల్‌ఎ లాంఛనంగా పంపిణీ చేశారు. ప్రశంసా పత్రాలు, ఇతరాలతో వారిని సత్కరించారు. మెమెంటోలను అందజేశారు. అనంతరం ఎంఎల్‌ఎ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు, ఇతర పథకాలను లబ్ధిదారులకు నేరుగా చెల్లించేందుకు వాలంటీర్ల వ్యవస్థ అందజేస్తున్న సహాయ, సహకారాలు అభినందనీయమన్నారు. దీనిలో ఏవిధమైన దళారీ వ్యవస్థ లేదన్నారు. ఇక మేలైన పనితీరు కనబరిచిన వాలంటీర్లకు గత నాలుగు సంవత్సరాల కాలంగా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డుల ఎంపికలో సైతం ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని తెలిపారు. దీనికి వాలంటీర్ల పనితీరు, ప్రభుత్వ ఆదేశాల అమలు, వివిధ పథకాల లబ్ధిదారులను చైతన్య పరచటం వంటి అంశాలను ప్రాతిపదికన తీసుకున్నట్లు తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వృద్ధాప్య పెన్షన్ కనీస వయసు పరిమితిని తగ్గించి గతంతో పోల్చుకుంటే పెంచిన మొత్తాలను అందజేస్తుందన్నారు. రానున్న కాలంలో మరింత ఎక్కువ మొత్తాలను ప్రణాళిక బద్ధంగా అందజేసేందుకు చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. సేవా వజ్ర అవార్డ్‌కు ఎంపికైన వాలంటీర్ వి.దేవి, శివ పార్వతి తమ అనుభవాలను వివరించారు. తన పరిధిలో ఒక కుటుంబానికి వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధి రూ.4 లక్షల 60 వేల వరకు అందజేయటం తనకు సంతృప్తి కలిగించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగ, మండల పరిషత్ అధ్యక్షులు కనమాల రామయ్య, ఎఎంసి ఛైర్‌పర్సన్ నీలిమ జూనియర్, భీమడోలు సర్పంచ్ల ఛాంబర్ అధ్యక్షురాలు సునీత మాన్సింగ్, భీమడోలు ఎంపిడిఒ సుమలత పాల్గొన్నారు.

చాట్రాయి: రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలు మూడు విభాగాలుగా వాలంటీర్లను సన్మానించడం జరుగుతుంది. ఈ వాలంటీర్ల వందన కార్యక్రమం మండలంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఎంపిడిఒ మంగా కుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని మాట్లాడుతూ ప్రతి 50 కుటుంబాలకు ఒక వాలంటీర్‌ను నియమించి ఆ కుటుంబాలకు ఉన్న సమస్యలన్నీ పరిష్కారం కోసం వాలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని, రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి వాలంటీర్‌పై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, ఎంపిపి లంక నిర్మల, వైస్ ఎంపిపి పుచ్చకాయల సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

వాలంటీర్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు: జిల్లాలో 28 మండలాలకు చెందిన గ్రామ, వార్డు వాలంటీర్ల 164 ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలోని వివిధ మండల, మున్సిపాలిటీ కార్యాలయాల పరిధిలోని గ్రామ/వార్డు సచివాలయాలలో వాలంటీర్ ఖాళీల భర్తీకి మంగళవారం ఆయన నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన ఆసక్తిగలవారు h ttp://40.81.241.107/APVOLUNTEER వెబ్‌సైట్‌లో నేరుగా దరఖాస్తులు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ భర్తీ ప్రక్రియలో భాగంగా ఆయా గ్రామాలు, వార్డుల్లో వాలంటీర్ల ఖాళీలు గతంలో కేటాయించిన రిజర్వేషన్ కేటగిరీ ప్రకారం భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఈ నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తులు ఈనెల 21వ తేదీ నుంచి 25 వరకు స్వీకరించబడునన్నారు. గడువు ముగిసిన పిదప సంబంధిత ఎంపిడిఒ ఆధ్వర్యంలో కమిటీ ద్వారా మౌఖిక పరీక్షలు నిర్వహించి, ఎంపిక నిర్వహించబడునని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

పోలవరం: శాంతిభద్రతల పరిరక్షణ తన ధ్యేయమని, ప్రజలకు సేవ చేసేందుకు 24 గంటలు సిద్ధంగా ఉంటామని డిఎస్‌పి ఎన్.సురేష్‌కుమార్ తెలిపారు. పోలవరం నూతన డిఎస్‌పిగా ఎన్.సురేష్ కుమార్ రెడ్డి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడంతో పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకారం అందించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 385 మంది హాజరు

ఏలూరు అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి బి.ప్రభాకర్ రావు మంగళవారం తెలిపారు. 4 కేంద్రాల్లో సాధారణ ప్రాక్టికల్స్, 5 కేంద్రాల్లో వృత్తివిద్య ప్రాక్టికల్స్ జరిగినట్లు ఆయన అన్నారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌లో 96 మందికి 96 మంది హాజరు కాగా, మధ్యాహ్నం నుంచి జరిగిన పరీక్షల్లో 291 మందికి 289 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన తెలిపారు.

సుందరీకరణ పనుల తనిఖీ

ఏలూరు : నగరంలో వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం తంగెళ్లమూడి నాలుగురోడ్ల సెంటర్‌లో నిర్మిస్తున్న వాటర్ ఫౌంటేన్, ఇతర నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఏలూరు నగర సుందరీకరణలో భాగంగా చేపట్టిన పనులను యుద్ధప్రాతిపధికన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక కమీషనరు ఎస్.వెంకటకృష్ణ ఉన్నారు.

జగనన్న సురక్ష సేవలు వినియోగించుకోవాలి

భీమడోలు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని భీమడోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారి స్వర్ణలత కోరారు. గుండుగొలను గ్రామపంచాయతీ పరిధిలోని భోగాపురం ఆవాస ప్రాంతంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిడిఒ ప్రారంభించారు. శిబిరంలో ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్ వై.సృజన, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ డి.సుహాంత్, జనరల్ వైద్య సేవలను డాక్టర్ కె.శ్రీలక్ష్మి, డాక్టర్ ఆర్.జాహ్నవి అందజేశారు. శిబిరంలో 493 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు ఎంపిడిఒ తెలిపారు. వీరిలో నలుగురికి ఉన్నత స్థాయి వైద్యం కోసం సిఫార్సు చేసినట్లు చెప్పారు.

CHANGE OF NAME

I, THUMMA VIJAYA BHASKARA RAO S/o. Thumma Venkanna (Late), D.No. 17-1-102A, Kothapalli vari Street, Rustumbada, Narsapur, Narsapur Mandal, W.G.Dt. A.P. I have changed my name from TUMMA VIJAYA BHASKARA RAO (Old name) to THUMMA VIJAYA BHASKARA RAO (New name) hence forth I am being called THUMMA VIJAYA BHASKARA RAO S/o. Thumma Venkanna (Late), for all purposes.

CHANGE OF NAME

I, KOLLABATHULA VENKATA OMESWARA RAO S/o. Kollabathula Ranga Rao, D.No.15-3-97/1, Palaparthivari Street, NTR Colony, Narasapur-534275, W.G.Dt. A.P. I have changed my name from KOLLABATHULA KARUNAKAR (Old name) to KOLLABATHULA VENKATA OMESWARA RAO (New name) hence forth I am being called KOLLABATHULA VENKATA OMESWARA RAO S/o. Kollabathula Ranga Rao, for all purposes.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 297/General/2023-24, Dated. 17-02-2024

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Supply and Delivery of LED Drivers, Strips with related accessories for the repairs of Street Lights of Eluru Municipal Corporation Limits."** Total No. of works is 1 with an amount of Rs. 9.57 Lakhs.

Tender schedules are available on e-procurement market place from 21-02-2024. Last date of receipt of tenders is 27-02-2024. Further details can be seen at e-procurement market place at www.apeprocurement.gov.in or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- COMMISSIONER
MUNICIPAL CORPORATION, ELURU